క్లుప్తంగా

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు



వడ్లపట్లలో పూజలందుకుంటున్న వీరబ్రహ్మేంద్ర స్వామి

భీమడోలు: భీమడోలు పంచాయతీ శివారు వడ్లపట్లలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్వామి వారికి భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోవింద మాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారిని విశేషంగా అలంకరించి దీపారాధన చేసి పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. ప్రతి ఏటా ఈ ఆలయంలో సాంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కె.వీర రాఘవులు, భక్తులు పాల్గొన్నారు.

యుద్ధ సమయంలో జాగ్రత్తలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఉంగుటూరు: యుద్ధ మేఘాలు ఆవరించిన ప్పుడు ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండేందుకు ప్రయత్నించాలని ఎంపీడీవో శ్రీ జి ఆర్ మనోజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభ్యాస్ కింద మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మనోజ్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ తరువాత పాకిస్తాన్ స్పందించే తీరును బట్టి యుద్ధం ఆధారపడి ఉంటుందని, యుద్ధం అనివార్యమైతే ప్రజలు సురక్షితంగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు.

సైఫన్ మరమ్మతులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మహేష్ యాదవ్

దెందులూరు: సీతంపేట కాలువ సైఫన్ మరమ్మతులకు బుధవారం ఏలూరు ఎంపీ పి.మహేష్ యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించారు. ఆయన వెంటన ఏపీ యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్ యాదవ్, దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, సర్పంచ్ తోట ఏసమ్మ ఉన్నారు.

నూతన బస్సు సర్వీసు ఏర్పాటుపై హర్షం

దెందులూరు: విజయవాడ నుంచి దెందులూరు మీదుగా ద్వారకాతిరుమల నూతన ఆర్టీసీ సర్వీస్ మంజూరైందని దెందులూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి సాధన సమితి చైర్మన్ మద్ద భూషణం అన్నారు. బుధవారం రామారావుగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దెందులూరు నుంచి ద్వారకాతిరుమల మధ్య 15 గ్రామాల ప్రజల కోరిక మేరకు విజయవాడ నుంచి దెందులూరు పంగిడిగూడెం మీదుగా ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి బస్సు మంజూరు చేయాలని జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఉమ్మడి చింతయ్యను కోరామని, ఆయన ఏలూరు ఎంపీ మహేష్ యాదవ్‌కు తెలపడంతో ఆయన ఆర్టీసీ అధికారులకు సిఫార్సు చేశారన్నారు. దీంతో అధికారులు విజయవాడ నుంచి ద్వారకాతిరుమల దెందులూరు పంగిడిగూడెం మీదుగా నూతన ఆర్టీసీ బస్సు మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్యశిబిరం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం జెడ్పీ హైస్కూల్‌లో అల్లూరి సీతారామరాజు యూత్ గోరుముచ్చు నాంచారయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండె, మెదడు, కంటి, దంతాలు, కీళ్ల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు అల్లూరి రత్నాజీరావు, భౌమరాజు సత్యనారాయణరాజు, జి.వెంకటేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు యూత్ నాయకులు పి.మంగరాజు, జి. పవన్ కళ్యాణ్, ట్రస్ట్ మెంబర్ జి.నీలిమ పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

కొయ్యలగూడెం: శిశువులకు టీకాల ద్వారా ప్రాణంతక వ్యాదుల నుంచి సంపూర్ణ రక్షణ లభిస్తుందని బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాజవరంలో బుధవారం ఇమ్యూనైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. తల్లులకు టీకాల ఆవశ్యకత, ఉపయోగాన్ని వివరించారు.

మండుతున్న ఎండలు.. నేలకొరుగుతున్న చెట్లు

- గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న ఎండల తీవ్రత
- సౌకర్యాల పేరుతో కుప్పకూలుతున్న వృక్షాలు
- 40 డిగ్రీలకు చేరుకుంటున్న ఉష్ణోగ్రతలు



రాష్ట్రీయ రహదారిపై ఎండ దెబ్బతో నామమాత్రంగా ఉన్న జనం తక్కువగా ఉన్న దృశ్యం



పూళ్ల, ఎంఎంపురం రోడ్డులో నరికి వేసిన చెట్టు

భీమడోలు: ఓ పక్క ఎండలు మండుతున్న వేళ.... పచ్చని చెట్లు నేల కొరుగుతున్నాయి. దీంతో గ్రామాల్లో ఉష్ణతాపం పెరిగి మండల ప్రజానీకం అల్లాడిపోతున్నారు. పలు గ్రామాల్లో చెట్లును సైతం నరికివేయడంతో ప్రజలు వేడిమిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వేసవి సీజన్‌లో వాతావరణంలో హెచ్చుతగ్గులతో పాటు ఆకాల వర్షాలు కురుస్తున్నా... మరుసటి రోజు నుంచి ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు, రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ఏడాది మార్చి నెలలోనే ఎండల తీవ్రత పెరగ్గా మే నెల వచ్చినా ఎండల తీవ్రత మరింత పెరిగింది. రోహిణి కార్తె సమీపిస్తుండడంతో ఎండ ఉధృతి రోజురోజు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భీమడోలు గ్రామం చుట్టూ జాతీయ, రాష్ట్రీయ రహదారులు విస్తరించింది. గతంలో రహదారుల సమయంలో పంట పొలాల స్థానంలో రోడ్లు వేయడంతో ప్రస్తుతం రహదారుల నుంచి వేడి గాలులు వీస్తున్నాయి. దీనితో పాటు గోదావరి కాల్వ మూసివేయడంతో భూ తాపం కూడా పెరిగింది. దీనితో ప్రజలు ఉష్ణతాపానికిఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రజలు ఉదయం 9 గంటల తర్వాత బయటకు రావాలంటేనే భీతిల్లిపోతున్నారు. వాతావరణ శాఖ గతేడాది కన్నా ఎక్కువ ఎండలు ఉంటాయని హెచ్చరించింది. అందులకు తగ్గట్లుగానే ఎండలు తారెత్తుతున్నాయి. భీమడోలు మండలంలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. గుండుగొలను,సూరప్పగూడెం, భీమడోలు, పోలసానిపల్లి, కురెళ్లగూడెం, పాతూరు, పూళ్ల గ్రామాల పక్క నుంచి రహదారులు వెళ్లడంతో ఆ గ్రామాల ప్రజలకు వాహనాల నుంచి వేడితో పాటు ఎండ తీవ్రతకు ప్రజలు నానా ఇక్కట్లును అనుభవిస్తున్నారు. అదే విధంగా గ్రామాల్లోని రోగులు, వృద్ధులు, పిల్లలు ఎండ తీవ్రత వల్ల ఆనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. ఉపాధి హామీ కూలీలు ఎండలోనే పనులు చేస్తున్నారు. వారికి పని ప్రదేశంలో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనెలాఖరు వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ నిపుణులు అంటున్నారు.

సౌకర్యాల పేరుతో కుప్పకూలుతున్న వృక్షాలు

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే వృక్షాలను సౌకర్యాల సాకుతో కుప్ప కూలిస్తున్నారు. దీనితో ఒక్కప్పుడు చల్లని వాతావరణానికి నిలయంగా ఉన్న ప్రదేశాలు నేడు నిలువ నీడ లేక ఎండ తీవ్రతతో అల్లాడిపోతున్నారు. దీనికి వృక్షాలను విచ్చలవిడిగా నరికివేయడమే కారణమని పర్యావరణ వేత్తలు అంటుంన్నారు. భీమడోలు జంక్షన్ నుంచి ఏలూరు, భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వైపు, పూళ్ల నుంచి ఎంఎంపురం వైపు వెళ్లే రహదారి వెంబడి ఓ పక్క ఉన్న చోట్లను నరికి వేస్తున్నారు. వాటిని కరెంట్ వైర్లుకు అడ్డుగా ఉండడంతో కరెంట్ షాక్ వస్తుందని నరికి వేస్తున్నారు. పూళ్ల, ఎంఎంపురం రహదారి వెంబడి నూతనంగా విద్యుత్ లైన్ పనులు చేపట్టడంతో చెట్లు నరికితే వాటిని గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనితో ఆ ప్రదేశాలు చెట్లు లేక కళాహీనంగా మారాయి. దీంతోచల్లని గాలులు వీచే పరిస్థితి లేదు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న పీడీ శారద

పెదవేగి : పిల్లలు యొక్క ఎదుగుదలను అభివృద్ధిని అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు తల్లిదండ్రులు పరిశీలిస్తూ వారి మానసిక శారీరక ఎదుగుదలకు కృషి చేయాలని జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ పి శారద అన్నారు. పెదవేగి మండలం విజయరాయి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని పీడీ శారద బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులతో పాటలు పాడించి, రంగులను గుర్తించడం, ఆకారాలు చెప్పించడం చేశారు. పిల్ల లెక్క అభివృద్ధి అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు పౌష్టికాహార పంపిణీ చేసి, వారికి గర్భం దాల్చిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన పై కౌన్సిలింగ్ ఇచ్చారు. ముఖ్యంగా రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహారం గురించి తల్లులకు పీ డీ వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ సూపర్వైజర్ మేరీ బయమ్మ, కార్యకర్త బేబీ రాణి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నారాయణపురం వెల్ నెస్ సెంటర్లో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రత పాటించాలని తాడేపల్లిగూడెం మలేరియా అధికారి లక్ష్మణరావు అన్నారు. బుధవారం నారాయణపురం వెల్ నెస్ సెంటర్లో చిన్నారులకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ డ్రైడే ఫ్రైడే పాటిస్తూ పరిసరాల పరిశుభ్రత చేసుకుంటూ కీటక జనిత వ్యాదులు దూరం చేయవచ్చునని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచితే మలేరియా ఫైలేరియా, చికెన్‌గున్య, మెదడు వాపు వంటి వ్యాధులను దూరం చేయవచ్చునని అన్నారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవితం సుజాత, ఆధాల స్వప్న, లక్ష్మీ , అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

దెందులూరు: చట్టాలపై పౌరులకు అవగాహన అవసరమని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ మే1న కార్మిక దినోత్సవం సందర్భంగా ఏడు రోజుల పాటు అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించామని తెలిపారు. ఈ న్యాయవిజ్ఞాన సదస్సులు బుధవారంతో ముగిశాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు చట్టాలతో పాటు ఈ–శ్రమ్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సూర్య చక్రవేణి, ఏలూరు ఎంపీడీఓ శ్రీలత, సర్పంచ్ ప్రభుదేవా, న్యాయవాది పి.రత్నరాజు, ఏపీడీ విక్టర్, గ్రామ కార్యదర్శి వై.సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వీరబ్రహ్మేంద్ర స్వామి నడయాడి, సజీవ సమాధి పొందిన ప్రాంతాలను జాతీయ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా గుర్తించి అభివృద్ధి చేయాలని, ఆయన ప్రభోదాల ప్రచారానికి, అధ్యయనానికి అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ప్రధాన సంచాలకుడు అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధిలో ప్రవేశించిన రోజు 332వ ఆరాధనా మహోత్సవాలను బుధవారం స్థానిక పడమరవీధి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో, పవరుపేట విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో శివశ్రీ మాట్లాడుతూ యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వాలు వీరబ్రహ్మేంద్ర స్వామిని మించిన యోగి లేడన్న విషయాన్ని గుర్తించాలన్నారు. 16వ శతాబ్దంలో తెలుగునాట నడయాడిన వీరబ్రహ్మేంద్ర స్వామి తన తపశ్శక్తితో యోగ దృష్టితో భవిష్యత్తు దుష్పరిణామాలను ముందుగానే దర్శించి కాలజ్ఞానంలో పొందుపరిచారని గుర్తుచేశారు. ఆధ్యాత్మిక వేత్త గొల్లపల్లి కామేశ్వరరావు వీరబ్రహ్మేంద్రస్వామి తత్వాలను పాడి వినిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దాకోజు పార్వతి వరప్రసాద్, కార్యదర్శి ముశినాడ శేఖర్, కోశాధికారి నాగమల్లి దుర్గారావు, సంఘ అధ్యక్షుడు శింహాద్రి భృంగాచార్యులు, కార్యదర్శి మానేపల్లి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు.

11న ఘంటసాల స్వరపీఠం మాతృదినోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఘంటసాల స్వరపీఠం సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న మాతృదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్‌ఎం సుభాని తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాల్లో ఆయన మాట్లాడుతూ స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఈ కార్యక్రమాల్లో భాగంగా మాతృమూర్తికి స్వ ర నీరాజనం పేరిట సంగీత విభావరి నిర్వహి స్తామన్నారు. స్వరపీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు తల్లి కమలావతి సంస్మరణార్థం పలువురు మాతృమూర్తులను సత్కరిస్తామని తెలిపారు. మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ పేద మహిళలు ఇద్దరికి కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తామని, విద్యార్థులకు నగదు ప్రోత్సాహకా లు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకలాపాలకు నగదు సాయం అందిస్తామని తెలిపారు. అనంతరం 11న నిర్వహించే కార్యక్రమాల కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ఘంటసాల స్వరపీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, ఈటి అర్జున్ కుమార్ పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోనాలి



ప్రమాదంలో తీసుకోవాల్సిన మెలకువలను వివరిస్తున్న ఎస్సై వై.సుధాకర్, అగ్నిమాపకాధికారి జి.నాగరాజు

భీమడోలు: విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోనేందుకు ప్రజలకు అవగాహన అవసరమని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం రెవెన్యూ, పోలీస్, ఫైర్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులకు సంఘ విద్రోహ చర్యలను నిర్వీర్యం చేయడం, ప్రజలకు భద్రత, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీపీ ప్రాంగణంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రమాదాలను చాకచక్యంగా తప్పించుకునేందుకు అవసరమైన మెలకువలను భీమడోలు అగ్నిమాపకాధికారి జి.నాగరాజు వివరించారు. ఎస్సై వై.సుధాకర్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ప్రేలుడు పదార్థాలు, అనుమానస్పదమైన బ్యాగులు, ఉగ్రవాదుల దాడుల చేపడితే తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మాక్ డ్రిగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సంఘ విద్రోహశక్తులు దాడులు చేస్తే అన్ని శాఖల సంయుక్తంగా విధులు నిర్వహించి ప్రాణనష్టం, అస్తినష్టం లేకుండా ప్రతి ఒక్కరం ఎదుర్కొన్నాలన్నారు. అనంతరం ప్రమాదం పొంచియున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదబారిన పడిన వారిని రక్షించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఈ మాక్ డ్రిల్ ద్వారా భవిష్యత్తులో సంభవించే అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.



దెందులూరులో మాక్‌డ్రిల్ చేస్తున్న ఫైర్ సిబ్బంది

బ్యాగులు, వ్యక్తులు, ఇతర వస్తువులు కనిపిస్తే 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, ఏఎస్‌వో దుర్గాప్రసాద్, హౌసింగ్ ఏఈ చైతన్య, వీఆర్వోలు, కానిస్టేబుల్స్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరులో..

దెందులూరు: యుద్ధం వస్తే తమకు తాము ఎలా రక్షించుకోవాలని సివిల్ సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన ముఖ్యమని అధికారులు అన్నారు. బుధవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఫైర్ సిబ్బంది రెండు కార్యాలయాల ఉద్యోగుల సమక్షంలో మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురంలోని బుధవారం సాయంత్రం లక్ష్మీనారాయణ దత్తాత్రేయ, రాజ శ్యామల, గణపతి, ఆంజనేయ, భూసమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వార్ల విగ్రహాల గ్రామోత్సవ వైభవంగా జరిగింది. ఆలయంలో స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సంవత్సర వైశాఖ శద్దు సప్తమీని పురస్కరించుకుని ఈనెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆలయంలో విగ్రహాల ప్రతిష్టా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 7వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. చివరి ఘట్టమైన విగ్రహాల ప్రతిష్టలో భాగంగా వాటిని ఊరేగింపు ఘనంగా జరిగింది. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, వసంతకుమారి, పత్సమట్ల భీమరాజు, స్వాతిలక్ష్మీ దంపతులు ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలను నారాయణపురం, ఉంగుటూరు గ్రామాల్లో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మోదీకి ప్రజల రక్షణ కంటే బీహార్ ఎన్నికలే ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

ఏలూరు (టూటౌన్): ప్రధాని మోదీకి ప్రజల రక్షణ కంటే బీహార్ ఎన్నికలే ప్రధానంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ విమర్శించారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య అధ్యక్షతన బుధవారం పార్టీ ఏలూరు జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అక్కినేని వనజ మాట్లాడుతూ గత నెల 22న పహల్గాం దాడికి భద్రతా వైఫల్యమే కారణమని విమర్శించారు. ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా సైనికులు తీసుకునే చర్యకు సీపీఐ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఆదివాసీలను తరిమికొట్టి అటవీ ఖనిజ సంపద, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమే లక్ష్యంగా కేంద్రం ఆపరేషన్ కగార్ కార్యక్రమం నిర్వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వి భజన పేరుతో దక్షిణాది రాష్ట్రాలపై ఉత్తరాది పెత్తనం రుద్దడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. తొలుత సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఇటీవల మరణించిన పార్టీ సీనియర్ నాయకులకు సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. సమావేశంలో నాయకులు డేగా ప్రభాకర్, చలసాని వెంకట రామారావు, ఎండీ మునీర్, ఉప్పులూరి హేమ శంకర్, కారం దారయ్య, సన్నేపల్లి సాయిబాబా, మైసాక్షి వెంకటాచారి, పుప్పాల కన్నబాబు, బాడిస రాము, జేవీ రమణ రాజు, కొండేటి బేబి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

20న మున్సిపల్ కార్మికుల సమ్మె

ఏలూరు (టూటౌన్): ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటున్నట్టు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కి బుధవారం సమ్మె నోటీసు అందజేశామన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు అధ్యక్షులు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్ బాబు పాల్గొన్నారు.

సీఎన్‌సీలో సీఆర్‌ఆర్ కాలేజీకి ప్రథమం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన 10వ వార్షిక సిటీ నేచర్ ఛాలెంజ్–2025 (సీఎన్‌సీ)లో స్థానిక సీఆర్ రెడ్డి మహిళా కళాశాల రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ జి.సరళ తెలిపారు. ప్రతి ఏటా ఏప్రిల్ 25 నుంచి 28 వరకు నిర్వహించే ఈ పోటీలో ప్రజలు తమ చుట్టుపక్కల ఉన్న ప్రకృతిని గమనించి ఫొటోలు తీసి, సిటీ నేచర్ ఛాలెంజ్ లింక్‌లో ఐ నేచురలిస్ట్ అప్లికేషన్ ద్వారా అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొత్తం 33264 ఫొటోలు అప్‌లోడ్ చేయగా, ఒక్క ఏలూరు నుంచి 25897 ఫొటోలు అప్‌లోడ్ చేశారని పేర్కొన్నారు. మే 5న విడుదలైన ఫలితాల్లో తమ కళాశాల రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, జాతీయ స్థాయిలో మూడో స్థానం, అంతర్జాతీయ స్థాయిలో 26వ స్థానంలో నిలిచిందని వివరించారు. ఈ ఘనతకు కారణమైన జువాలజీ శాఖ హెచ్‌ఓడీ స్వప్నను, కళాశాల విద్యార్థినులను కళాశాల కరెస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు శుభాకాంక్షలు తెలిపారని పేర్కొన్నారు.

అల్లూరి జీవితం నేటి తరాలకు ఆదర్శం



భీమడోలులో అల్లూరి చిత్రపటానికి మాలలు వేసి ఘన నివాళులర్పిస్తున్న టీవీ ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్, విద్యార్థులు



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమడోలు: విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం భవిష్యత్తు తరలాలకు ఆదర్శమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో 9వ రోజైన బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో శిక్షణ తరగతులు జరిగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణ తరగతులకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణ పొందారు. విద్యార్థులు సామూహిక పుస్తక పఠనం చేశారు. నీతి కథలు వినడంతో పాటు నీతి కథలను వారు చెప్పారు. జీకే, గణితంలోని మెలకువలను గ్రంథపాలకుడు వివరించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన యోధుడన్నారు. బ్రిటిష్ వారి గుండెల్లోకి బాణంలా దూసుకెళ్లిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయన పేరుతో జిల్లాను ఏర్పాటు చేయడం చాలా సంతోషమన్నారు. అనంతరం విద్యార్థులు ఇన్‌డోర్, అవుట్ డోర్ గేమ్స్ ఆడారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్, గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణిల ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి.

గ్రంథాలయంలో ఆటల పోటీలు

దెందులూరు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి విద్య క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని పోతునూరు గ్రంథాలయాధికారి రాంబాబు అన్నారు. బుధవారం పోతునూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు కోకో సీనియర్ జూనియర్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బహుమతులను వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ముగింపు రోజున అందిస్తామని తెలిపారు.